క్లుప్తంగా

గ్యాస్ వినియోగంపై అవగాహన

అశ్వాపురం: హెచ్‌పీసీఎల్ గోల్డెన్ జూబ్లీ వేడుకల సందర్భంగా హెచ్‌డబ్ల్యూపీఎం ఈసీసీ స్టోర్స్ లిమిటెడ్ ఆధ్వర్యంలో సోమవారం గౌతమీనగర్ కాలనీలోని అణుశక్తి కేంద్రీయ విద్యాలయంలో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. బహుమతులను మణుగూరు భార జల కర్మాగారం జీఎం ఎస్.జగ్గారావు అందజేశారు. విద్యార్థులకు గ్యాస్ వినియోగంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసీసీ స్టోర్స్ సెక్రటరీ టీఎస్‌పీ.రవికుమార్, సైంటిఫిక్ ఆఫీసర్ శ్రీమణిఒడియా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీజీఎంలు శ్రీనివాస్, జగన్నాథశర్మ, సీఏఓ వేణు, వైస్ ప్రిన్సిపల్ రుఖమాంగధర్‌రావు, హెచ్‌ఎం సంజయ్‌బోయాయి, ఈసీసీ స్టోర్స్ సెక్రటరీ టీఎస్‌పీ.రవికుమార్, ఉపాధ్యక్షుడు పెంటి సురేష్ పాల్గొన్నారు.

సమాచారం ఇవ్వండి

చర్ల: మండలంలోని పలు గ్రామాలలో అక్రమ మద్యం సమాచారం ఇవ్వాలంటూ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో వాల్‌పోస్టర్లు వెలిశాయి. నాటుసారా, గుడుంబా కల్తీమద్యం, గంజాయి, మాదక ద్రవ్యాలు తదితర వాటి వినియోగం, రవాణాపై టోల్‌ఫ్రీ నంబర్ 1800 4252 523కు సమాచారం ఇవ్వాలంటూ ఎక్సైజ్‌శాఖ వాల్‌పోస్టర్లలో కోరింది.

ఆదర్శంగా తీసుకోవాలి

చర్ల: ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, తామ్రపత్ర గ్రహీత చింతలచెర్వు వెంకటాద్రిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకెవాలని భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు అన్నారు. ఆయన 38వ వర్ధంతి సందర్భంగా చర్లలోని శాఖ గ్రంథాలయ ఆవరణలో ఉన్న వెంకటాద్రి విగ్రహానికి పలువురు ప్రముఖులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రైస్‌పేటలోని త్యాగిస్థల్ వద్ద శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం రైస్‌పేటలోని శైలజా విహార్‌లో వెంకటాద్రి మనుమడు, హైకోర్టు అడ్వకేట్ సీహెచ్ సతీష్ కుమార్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన వర్ధతి సభలో మ్మెల్యే వెంకట్రావుతో పాటు పలువురు ప్రముఖులు మాట్లాడారు. ఎంపీడీఓ ఈదయ్య, టీపీసీసీ సభ్యుడు నల్లపు దుర్గాప్రసాదరావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు విజయ భాస్కర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

'పోడు' పట్టాలివ్వాలి

దమ్మపేట: గిరిజన పోడు సాగుదారులకు, భూహక్కు పత్రాలు (పోడు పట్టాలు) మంజూరు చేయాలని కోరుతూ.. భద్రాచలం ఐటీడీఏ ఏపీఓ డేవిడ్ రాజ్‌కు స్థానిక గిరిజన రైతులు వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఏపీఓ, పూర్తిస్థాయిలో పరిశీలించిన పిదప, సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ సోయం ప్రసాద్, కాసాని నాగప్రసాద్, మడకం సుశీల, రాజేష్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ దినోత్సవాన్ని అధికారికంగా జరపాలి

దుమ్ముగూడెం: ఆగస్టు 9న జరగబోయే ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ప్రభుత్వాలు అధికారికంగా జరపాలని ఆదివాసీల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం లక్ష్మీనగరం గ్రామంలో ఆదివాసి సంఘాల కార్యచరణ వేదిక ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న ఆదివాసీ నాయకులు మాట్లాడుతూ.. ప్రపంచ ఆదివాసీ దినోత్సవ కార్య చరణ కార్యక్రమం విషయంపై రెండో దఫా సమావేశం ఈనెల 20వ తేదీన నడికుడి వీవీ ఆర్ ఫంక్షన్ హాల్ లో నిర్వహించనున్నట్టు తెలిపారు. సమావేశంలో ఆదివాసి నాయకులు కొమరం దామోదర్ రావు, కుంజా శ్రీనివాసరావు, కనితి రాముడు, సొందె మల్లురు, రేసు ఆదినారాయణమూర్తి, తెల్లం హరి, తునికి కామేష్ రావు, కారం గోపాల్, బొర్రయ్య, నూప సీతయ్య, వీర్రాజు ఎంపీపీ రేసు లక్ష్మి, ఆదివాసీ నాయకురాలు వాగే రాజేశ్వరి, మిడియం జయ పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

భద్రాచలంఅర్బన్: రోటరీ క్లబ్ ఆఫ్ భద్రాచలం నూతన కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. భద్రాచలంలోని గుప్తా కన్వెన్షన్ హాల్‌లో జరిగిన నూతన కమిటీ ఎన్నికల్లో అధ్యక్షుడిగా దారా బాలాజీరావు, కార్యదర్శిగా నూకల విద్యాసార్, ట్రజరర్‌గా వందవాసు శ్రీనివాసరావులను ఎన్నుకోగా.. వీరిచే రోటరీ ఫాస్ట డిస్ట్రిక్ గవర్నర్ మల్దా వాసుదేవరావు ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ ఎంపికకు భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు ముఖ్య అతిదిగా హాజరు కాగా, ఇన్‌స్టాలేషన్ ఆఫీసర్‌గా రోటరీ ఫాస్ట్ డిస్ట్రిక్ట గవర్నర్, గెస్ట ఆఫ్ హానర్ రోటరీ డిప్యూటీ గవర్నర్ సాంబశివరావు, ప్రతినిధులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో యువకులు

చండ్రుగొండ: నిరుద్యోగ సమస్యపై ప్రగతిభవన్ ముట్టడి ఆందోళనకు హైదరాబాద్ వెళ్తున్న ఆరుగురు నిరుద్యోగ యువకులను సోమవారం రాత్రి పోలీసులు అదుపులో తీసుకున్నారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన గుగులోతు మోహన్‌నాయక్, భూక్య రాందాస్, దారావత్ సీతారాములు, తంబళ్ళ పుల్లారావు, ఇల్లంగి బాలకృష్ణ, దారావత్ నాగేశ్వరరావులను అదుపులో తీసుకుని వ్యక్తిగత పూచికత్తుపై విడుదల చేసినట్లు ఎస్సై గంజి స్వప్న తెలిపారు.

బిల్లులకు మోక్షమెప్పుడు..?

- రెండేళ్ల క్రితం ముంచుకొచ్చిన గోదారి వరదలు
- సామగ్రి, భోజనాలు సమకూర్చిన వ్యాపారులు
- సంబంధిత చెల్లింపులు నేటికీ పెండింగ్‌లోనే..


మొండికుంట పునరావాస కేంద్రంలో వరద బాధితులకు భోజనాల వడ్డింపు (ఫైల్)



గోదావరి వరద బాధితులను ట్రాక్టర్‌లో పునరావాస కేంద్రాలకు తరలిస్తున్న అధికారులు (ఫైల్)

అశ్వాపురం: మండలంలో రెండేళ్ల క్రితం గోదావరి వరదలకు చేపట్టిన సహాయక చర్యలకు సంబంధించి బిల్లులకు ఇప్పటి వరకు మోక్షం కలగడంలేదు. రెండేళ్లుగా అప్పులు పెట్టిన వ్యాపారులు తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతూ ఇబ్బందులు పడుతున్నారు.

రూ.20,04,750 పెండింగ్..

2022లో గోదావరి వరదల వల్ల మండలంలో గోదావరి పరివాహక ప్రాంతాలు వరద ముంపుకు గురయ్యాయి. ప్రభుత్వం, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండల పరిధిలోని అమ్మగారిపల్లి, పాములపల్లి, కుమ్మరిగూడెం, అమెర్ద, చింతిర్యాల, ఆనందాపురం, నెల్లిపాక గ్రామాల వరద ముంపు ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించారు. పునరావాస కేంద్రాలలో వరద బాధితులకు భోజన వసతి వంటి సౌకర్యాలు కల్పించారు. వరదల సమయంలో నిధుల కొరతతో అధికారులు స్థానికంగా మండలంలో కొందరు వ్యాపారుల వద్ద కిరాణా, కూరగాయలకు అప్పులు చేసి వరద బాధితులు సౌకర్యాలు కల్పించారు. వరద బాధితులను పునరావాస కేంద్రాలకు తరలించేందుకు ట్రాక్టర్లు ఉపయోగించారు. గోదావరి పరివాహక గ్రామాలలో పడవ కార్మికుల పడవలు డబ్బులు చెల్లించేలా ఒప్పందం చేసుకొని ఉపయోగించారు. అధికారులు వెంటనే డబ్బులు చెల్లిస్తామని మాట ఇవ్వడంతో అధికారుల మాట ప్రకారం పలువురు వ్యాపారులు అప్పులు పెట్టారు. రూ.20,04,750 తో బిల్లులకు రెవెన్యూ అధికారులు ఉన్నత అధికారులకు నివేదించారు. రెండేళ్లుగా వ్యాపారులు బిల్లుల కోసం తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. అధికారులు ఇదిగో అదిగో అని కాలయాపన చేస్తున్నారే తప్ప బిల్లులకు రెండు ఏండ్లుగా మోక్షం కలగడం లేదు. వరదల సమయంలో మానవతా దృక్పథంతో అధికారుల హామీతో అప్పులు పెట్టామని రెండు ఏండ్లుగా ఎవరు పట్టించుకోవడం లేదని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారులు స్పందించి గోదావరి వరదలకు సంబంధించిన పెండింగ్ బిల్లులు వెంటనే మంజూరు చేయాలని బాధితులు కోరుతున్నారు.

అధికారుల దృష్టికి తీసుకెళ్లాం..

గోదావరి వరదల పెండింగ్ బిల్లులకు సంబంధించి పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఇటీవల కలెక్టరేట్ ఏఓకు విన్నవించి బిల్లులు మంజూరు చేయించాలని కోరాం. బిల్లుల మంజూరుకు చొరవ తీసుకుంటాం.

– స్వర్ణలత, అశ్వాపురం తహసీల్దార్

గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలు



అన్నపురెడ్డిపల్లి: విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న ప్రభుత్వ వైద్యురాలు ప్రియాంక

అన్నపురెడ్డిపల్లి: మండలంలోని ఎర్రగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో.. అన్నపురెడ్డిపల్లిలోని గిరిజన బాలికల పాఠశాలలో సోమవారం ప్రభుత్వ వైద్యురాలు ప్రియాంక ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఏఎన్ఎంలు, నర్సులు పాల్గొన్నారు.

అశ్వారావుపేటరూరల్: మండలంలోని కుడుములపాడు గిరిజన గ్రామంలో సోమవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వినాయకపురం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రాందాస్ నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో. 35 మందికి ఆరోగ్య పరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సబ్ యూనిట్ అధికారి అజ్మీర వెంకటేశ్వరరావు, హెచ్‌ఈఓ రాజు, సూపర్ వైజర్ శ్రీనివాస్, రవి, వెంకటలక్ష్మి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

చర్లరూరల్: పట్టణంలోని గణేష్ నగర్ ప్రాంతంలో సోమవారం కొయ్యూరు పీహెచ్‌సీ హోమియోపతి వైద్యురాలు పూజ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 70 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి వారికి కావలసిన మందులు పంపిణీ చేశారు. హెల్త్ సూపర్ వైజర్ రాంప్రసాద్, హెల్త్ అసిస్టెంట్ లలిత, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మణుగూరురూరల్: మండల పరిధిలోని వలస ఆదివాసీ గిరిజన గ్రామమైన బుగ్గలో మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో గ్రామస్తులకు వైద్యసిబ్బంది పలు రకాల వైద్యపరీక్షలు చేసి నివారణ మందులను పంపిణీ చేశారు. వీరిలో పలువురి జ్వరపీడితుల రక్తనమూనాలను సేకరించారు. ఇళ్లల్లోని నీటి నిల్వలను శుభ్రం చేయించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ పుష్పారాణి, వైద్యసిబ్బంది రాంప్రసాద్, ఉమేష్, సుజాత, ఎంఎల్‌హెచ్‌పీ ప్రియభారతి, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలను అమలు చేయాలి

అశ్వారావుపేటరూరల్: అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీ పథకాలను తక్షణమే అమలు చేయాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జాతీయ నాయకుడు కెచ్చెల రంగారెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు గోగినపల్లి ప్రభాకర్ డిమాండ్ చేశారు. స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో ముందుగా ఆరు గ్యారెంటీలతో కూడిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ..గడిచిన పదేళ్లుగా పేదలకు, అర్హులైన వారికి రేషన్ కార్డులు ఇవ్వలేదని తక్షణమే రేషన్ కార్డులతోపాటు పెన్షన్లు, ఇళ్ల స్థలాలు, ఇందిరమ్మ ఇళ్లు, గిరిజనేతరులు సాగు చేస్తున్న పోడు భూములకు హక్కు పట్టాలు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకోచ్చేందుకు పార్టీ పిలుపు మేరకు ఈ నెల 22వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా మండల కేంద్రాల్లో ప్రదర్శనలు, ధర్నాలు చేపట్టి తహసీల్దార్‌లకు వినతిపత్రాలు అందిస్తామన్నారు. అలాగే ఈ నెల 29వ తేదీన అన్ని జిల్లా కేంద్రాల్లో ధర్నాలు నిర్వహించి, జిల్లా కలెక్టర్లకు వినతి పత్రాలను అందించాలని పార్టీ శ్రేణులకు పిలుపు నిచ్చారు. సమావేశంలో పార్టీ నాయకులు వాసం బుచ్చిరాజు, కంగాల భూలక్ష్మి, గోగినపల్లి గంగా, కంగాల వీరమ్మ, నర్సమ్మ, చిన్న లక్ష్మి పాల్గొన్నారు.

విష జ్వరాలపై దృష్టి పెట్టాలి

అశ్వారావుపేటరూరల్: వర్షాకాలం సీజన్ నేపథ్యంలో పెరుగుతున్న విష జ్వరాలపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెట్టాలని పీవోడబ్ల్యూ జిల్లా కార్యదర్శి కెచ్చెల కల్పన డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక సీపీఐ(ఎంఎల్) కార్యాలయంలో పీవోడబ్ల్యూ, పీవైఎల్ డివిజన్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తక్షణమే విష జ్వరాలను ఆరికట్టాలని, దోమల వ్యాప్తి వల్ల ప్రాణాంతకమైన డెంగీ, మలేరియా, జీకా వైరస్ వ్యాప్తి చెందుతున్నాయని అన్నారు. ప్రతీ గ్రామంలో దోమ తెరలను ఉచితంగా పంపిణీ చేపట్టాలని, క్లోరినేషన్, శానిటేషన్ పనులు చేపట్టి ర్యాపిడ్ ఫీవర్ పరీక్షలు చేయాలని అన్నారు. సమావేశంలో పీవైఎల్ రాష్ట్ర కోశాధికారి వాసం బుచ్చిరాజు, తోడం దుర్గమ్మ, కంగాల భూక్ష్మి, కొల్లూరి పద్మ, కొంద్రు లక్ష్మి, కంగాల వీరమ్మ, బంగారమ్మ పాల్గొన్నారు.

అంగన్‌వాడీల నిరసన

అంగన్‌వాడీ కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా పలు చోట్ల సోమవారం ధర్నాలు నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాలను ముట్టడించి నిరసనలు వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలపై బలవంతపు పదవి విరమణ ఆపివేయాలని, పదవి విరమణ అనంతరం సగం జీతం పెన్షన్‌గా ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యేకు వినతిపత్రం అందించారు.

– సాక్షి నెట్‌వర్క్



మణుగూరుటౌన్: ప్రజా భవన్ ఎదుట ధర్నా చేపడుతున్న అంగన్‌వాడీ టీచర్లు



దమ్మపేట: ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట ఎమ్మెల్యే ప్రైవేటు పీఏకి వినతి..


భద్రాచలంఅర్బన్: ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

రేషన్ దుకాణాల్లో తనిఖీ

మణుగూరురూరల్: మండలంలోని పలు రేషన్ దుకాణాలను పౌరసరఫరాల శాఖ డీటీ శివకుమార్ సోమవారం సందర్శించి తనిఖీ చేశారు. రేషన్ దుకాణాల్లో నిల్వలను పరిశీలించి స్టాక్ రిజిస్టర్‌లను, ఎంతమంది మంది లబ్ధిదారులకు రేషన్ పంపిణీ చేశారో రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు.

జాగ్రత్తలు తీసుకోవాలి

ములకలపల్లి: వర్షాకాలం నేపథ్యంలో గిరిజన గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పాలకపక్షం ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సీపీఐ రాష్ట్రసమితి సభ్యుడు నరాటి ప్రసాద్ డిమాండ్ చేశారు. మండల పరిధిలోని పాతూరు గ్రామంలో సోమవారం పర్యటించిన ఆయన, స్థానికులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడారు. దోమల మందు పిచికారీ చేయించాలని, దోమ తెరలు పంపిణీ చేయాలని అన్నారు. సీపీఐ మండల కార్యదర్శి ఎండి.యూసఫ్, మండలకమిటీ సభ్యులు సడియం వెంకటేశ్, సడియం నాగరాజు, దుబ్బా వీరస్వామి, బండి ముత్తేశ్, సడియం రామారావు, నాగరాజు పాల్గొన్నారు.

ప్రజావేదిక..

మణుగూరురూరల్: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులపై మణుగూరు మండల పరిషత్ కార్యాలయం స్త్రీశక్తి భవనంలో సోమవారం ప్రజావేదిక నిర్వహించారు. ఏప్రిల్ 2023 నుంచి మార్చి 31, 2024 వరకు జరిగిన ఉపాధి హామీ పనులపై గ్రామ స్థాయి సామాజిక తనిఖీల నివేదికలను చదివి సంబంధిత అధికారులు చదివి వినిపించారు. ఎంపీడీఓ టి.శ్రీనివాసరావు, జిల్లా ప్రాదేశిక సభ్యులు, గ్రామపంచాయితీల ప్రత్యేక అధికారులు, ప్రజాప్రతినిధులు, పంచాయితీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది, కూలీలు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులు సరికావు

కరకగూడెం: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలు అమలు చేసే వరకు వదిలిపెట్టేది లేదని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రావుల సోమయ్య పేర్కొన్నారు. పార్టీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో తలపెట్టిన సెక్రటేరీయట్ ముట్టడిలో భాగంగా వెళ్తున్న కరకగూడెం బీఆర్ఎస్ పార్టీ యూత్ ప్రెసిడెంట్ రంజిత్ కుమార్ను పోలీసులు ముందస్తుగా ఆదివారం రాత్రికి రాత్రే అరెస్ట్ చేయడం సరికాదని సోమవారం ఓ ప్రకటనలో అన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు జాబ్ క్యాలెండర్లు, 2 లక్షల ఉద్యోగాల నోటిఫికేషన్ త్వరగా ఇవ్వాలన్నారు. డీఎస్సీ పరీక్షలను వాయిదా చేసి, గ్రూప్ 2, 3 పోస్టులు పెంచాలని డిమాండ్ చేశారు.

గడువు పొడిగించాలి

భద్రాచలంటౌన్: గిరిజన సంక్షేమ శాఖలో ఉపాధ్యాయుల బదిలీల గడువును మరో 3 రోజులు పొడిగించడంతో పాటు ఎడిట్ ఆప్షన్ సౌకర్యాన్ని కల్పించాలని డీడీ పి.మణెమ్మకు టీఎస్‌యూటీఎఫ్ నాయకులు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఆమె సానుకూలంగా స్పందించిన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బుటారి రాజు, మునిగడప రామాచారి పాల్గొన్నారు.

గ్రామీణ వైద్యులను గుర్తించాలి

బూర్గంపాడు: గ్రామాల్లో నిరంతర ప్రాథమిక వైద్యసేవలను అందిస్తున్న గ్రామీణ వైద్యులను ప్రభుత్వం గుర్తించాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ డివిజన్ నాయకుడు పున్నంచంద్ కోరారు. సోమవారం విడుదల చేసిన ప్రకటనలో రాత్రివేళల్లో, అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు ప్రథమచికిత్సలు చేసి వారి ప్రాణాలను నిలుపుతున్న గ్రామీణ వైద్యులకు సరైన గుర్తింపు లేదని అన్నారు.

రోడ్డుపై గుంత.. ఆదమరిస్తే చింత


అంబేద్కర్ సెంటర్‌లో ప్రమాదకరంగా ఉన్న గుంత

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలోని అంబేద్కర్ సెంటర్‌లో ఓ గుంత ప్రమాదభరితంగా మారింది. పాత మార్కెట్ మీదగా అంబేద్కర్ సెంటర్ వచ్చే దగ్గర భారీగా గుంత ఏర్పడింది. రోడ్డు మధ్యలో గుంత ఏర్పడటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనన్న ఆందోళన నెలకొందని పట్టణ ప్రజలు, వాహనదారులు వాపోతున్నారు. పగలు కనిపించినా, రాత్రి సమయంలో ద్విచక్ర వాహనం దారుడికి కనిపించకపోయినా లేదా అక్కడ గుంత ఉందనే ఆలోచన లేకపోయినా ప్రమాదం జరిగే ఆస్కారం లేకపోలేదు. కాబట్టి ఇప్పటికైనా సంబంధిత అధికారులు తక్షణం చర్యలు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

నల్లా కనెక్షన్ల సర్వేపై వివాదం

దుమ్ముగూడెం: మండలంలోని పలు పంచాయతీల్లో అధికారులు, పంచాయతీ కార్యదర్శులు నిర్వహించిన సర్వేలో లోపాలు రావడంతో సోమవారం వివాదం రాజుకుంది. మండలంలో గత 10 రోజుల క్రితం పంచాయతీ కార్యదర్శులు, గ్రామ పంచాయతీ సిబ్బంది ఇంటింటికి వెళ్లి మిషన్ భగీరథ నల్లా కనెక్షన్లపై సర్వే నిర్వహిస్తున్నారు. సర్వే పూర్తయిన అనంతరం మిషన్ భగీరథ నల్లా కనెక్షన్ల వివరాలను ఈ నెల 16వ తేదీన ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంది.

కాగా ఇటీవల సర్వే చేస్తుండగా కొందరు మిషన్ భగీరథ పథకానికి సంబంధించిన ఇంజనీరింగ్ అధికారులు ప్రస్తుతం ఉన్న నల్లా కనెక్షన్ల కంటే 3వేల కనెక్షన్లు అధికంగా ఉన్నట్లు ఆన్‌లైన్ చేయాలని పంచాయతీ కార్యదర్శులపై ఒత్తిడి తీసుకువచ్చినట్లు తెలిసింది. కాని అంగీకరించక ఉన్న లెక్కనే ఆన్‌లైన్ చేశారు. దీంతో ప్రస్తుతం పంచాయతీ కార్యదర్శులు చేసిన సర్వేకు, మిషన్ భగీరథ అధికారులు గతంలో ఉన్నతాధికారులకు ఇచ్చిన నివేదికలకు వ్యత్యాసం ఏర్పడింది. ఈ నేపథ్యంలో గత మూడు రోజుల క్రితం గతంలో మండలంలో మిషన్ భగీరథలో డీఈగా విధులు నిర్వహించిన అధికారి వచ్చి పంచాయతీ సిబ్బంది లాగిన్ ఉపయోగించి ఒక్కో పంచాయతీలో 30 నుండి 250 నల్లా కనెక్షన్ల వరకు అదనంగా ఏర్పాటు చేసినట్లు సర్వే తారుమారు చేయడానికి ప్రయత్నించడం వివాదస్పదంగా మారింది. పంచాయతీ కార్యదర్శులకు తెలియకుండా పంచాయతీ సిబ్బంది లాగిన్‌లో దాదాపు 2వేల కనెక్షన్లు ఆన్‌లైన్‌లో ట్యాపింగ్ చేసినట్లు ఆరోపణలు బయటకు పొక్కడంతో ఈ సర్వే మిషన్ భగీరథ ఇంజనీరింగ్ అధికారుల మెడకు చుట్టుకునే పరిస్థితి ఏర్పడింది. దీంతో ఏం చేయాలో తెలియక తలలు బాదుకుంటున్నారు. ఈ వ్యవహారంపై మిషన్ భగీరథ డీఈ శ్రీనివాస్‌ను వివరణ కోరగా గతంలో భగీరథ అధికారులు సమర్పించిన నల్లా కనెక్షన్ల సంఖ్య 11వేల వరకు ఉన్నాయని తెలిపారు. కొన్ని పంచాయతీలలోని గ్రామాల్లో రోడ్డు నిర్మాణంలో భాగంగా నల్లా కనెక్షన్లు దెబ్బతిన్నాయని అవి లెక్కలోకి రావడం లేదని తెలిపారు. దీంతో ప్రస్తుతం జరుగుతున్న వివాదంలో నాకు ఎటువంటి సంబందం లేదని తెలిపారు. అలాగే ఎంపీడీఓ ముత్యాలరావును వివరణ కోరగా ప్రస్తుతం ఉన్న నల్లా కనెక్షన్లు మాత్రమే సర్వేలో నమోదు చేస్తున్నామని, మిషన్ భగీరథ అధికారులు పంచాయతీ సిబ్బంది లాగిన్ ఉపయోగించిన సర్వే లెక్కలను రద్దు చేశామని తెలిపారు.

డ్రెయినేజీ నిర్మించాలని రాస్తారోకో


ఆందోళనకారులకు నచ్చజెబుతున్న ఎస్సై స్వప్న

చండ్రుగొండ: మండలకేంద్రం చండ్రుగొండలోని జూలూరుపాడు రోడ్డుకు ఇరువైపులా డ్రెయినేజీల నిర్మాణాలు సత్వరమే చేపట్టాలని అదే రోడ్డుపై సోమవారం పలువురు గ్రామస్తులు రాస్తారోకో నిర్వహించారు. నిర్మాణాలపై రోజురోజుకూ రకరకాల వదంతులు వినిస్తున్నాయని మహిళలు వాపోయారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ వర్షాలు పడ్తున్న నేపథ్యంలో తాము పడ్తున్న ఇబ్బందులను వారు ఏకరువు పెట్టారు. వర్షపునీరు, మురికినీరు రోజుల తరబడి నిలబడి ఉండటంతో తాము పడ్తున్న నరకయాతనపై మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు వెడల్పు ఎంత చేయాలన్న అంశంపై అధికారుల వద్దే స్పష్టత లేకపోవడంపై ఆవేదన చెందారు. రాజకీయ నాయకులు ఒకరిపై ఒకరు పరస్పర ఆరోపణలు చేసుకుంటూ సమస్యను పక్కదారి పట్టిస్తున్నారని ఆరోపణలు చేశారు. ప్రభుత్వం సత్వర చర్యలు తీసుకుని డ్రెయినేజీల నిర్మాణాలు చేపట్టాలని ఆందోళనకారులు నినాదాలు చేశారు. గంటపాటు సాగిన ఈ ఆందోళనతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సంఘటన స్థలానికి చేరుకున్న ఎస్సై స్వప్న వారం రోజులు సమయం ఇవ్వాలని ఆందోళనకారులను శాంతింపజేశారు.

కారుణ్య నియామకాలు

మణుగూరుటౌన్: సింగరేణి ఉద్యోగంతో బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని ఏరియా జీఎం దుర్గం రాంచందర్ అన్నారు. సోమవారం సింగరేణిలో పనిచేస్తూ అన్‌ఫిట్ అయిన ఉద్యోగుల కుటుంబాలకు చెందిన నలుగురు అభ్యర్థులకు జీఎం కార్యాలయంలో కారుణ్య నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ.. రక్షణ క్రమశిక్షణతో విధులు నిర్వర్తిస్తూ సంస్థ పురోభివృద్ధికి పాటుపడాలన్నారు. కార్యక్రమంలో అధికారులు శ్యాంసుందర్, సలగల రమేశ్, సింగు శ్రీనివాస్, రామేశ్వర్‌రావు, గుర్తింపు సంఘం నాయకులు మేకల ఈశ్వర్, షాబుద్దీన్, శ్రీచరిత తదితరులు పాల్గొన్నారు.

అదనపు కలెక్టర్‌కు వినతి

అశ్వాపురం: గత 15 సంవత్సరాలుగా సేవలు అందిస్తున్న సీఎస్‌సీ కేంద్రాలకు మీసేవ కేంద్రాలను అనుసంధానం చేయాలని జిల్లా సీఎస్సీ వీఎల్‌ఈ సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్‌లో ప్రజావాణిలో అదనపు కలెక్టర్ విద్యాచందనకు వినతిపత్రం అందజేశారు. గత 15 సంవత్సరాలుగా కేంద్ర ప్రభుత్వ సర్వీసులు చేస్తున్నామని ప్రతి గ్రామంలో సీఎస్సీ సెంటర్లను ఏర్పాటు చేసి ప్రజలకు ఆయుష్మాన్‌భారత్, పీఎం కిసాన్, ఈశ్రమ్, ప్రధానమంత్రి విశ్వకర్మయోజన, జీవన్‌ప్రమాణ్, పీఎం దిశ వంటి సేవలు అందిస్తున్నామని, సీఎస్‌సీ సెంటర్లను మీసేవ కేంద్రాలుగా అనుసంధానం చేయాలని విన్నవించారు. జిల్లా వీఎల్‌ఈ సొసైటీ సభ్యులు, అన్ని మండలాల వీఎల్‌ఏలు పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయాలి

చర్ల: చర్ల మండల కేంద్రంలోని బస్టాండ్ సెంటర్ నుంచి మండల పరిషత్ కార్యాలయం వైపునకు వెళ్లే ప్రధాన రహదారికి మరమత్తులు చేసేందుకు వెంటనే నిధులు మంజూరు చేయాలని సీపీఐ పార్టీ డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం పార్టీ మండల కార్యదర్శి మచ్చా రామారావు నేతృత్వంలో అధ్వానంగా ఉన్న మండల పరిషత్ కార్యాలయ రహదారిపై నిలబడి నిరసన తెలియజేశారు. రహదారి మరమత్తులకు నిధులు కేటాయించాలని, విద్యార్థులు, ఉద్యోగులు, ఈ మార్గం గుండా రాకపోకలు సాగించే ప్రజల కష్టాలు తీర్చాలంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో నాయకులు బాలాజీ, సంతప్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాల పంపిణీ

ములకలపల్లి: తాళ్లపాయ జీపీ పరిధిలోని కొమరం భీం నగర్ వలస ఆదివాసీలకు 'హెల్త్ టూ యూ' ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిత్యావసర వస్తువులు, దుస్తులను వితరణగా అందజేశారు. సోమవారం గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు మాట్లాడుతూ.. ఆపన్నులను ఆదుకోవడమే సంస్థ లక్ష్యమని, సహకారం అందించిన మీనాక్షి, శ్రీకాంత్‌లకు కృతజ్ఞతలు తెలియజేశారు. చిన్నారులకు స్నాక్స్ అందించారు. వినయ్, నవీన్, మతిన్, సుభాని, సాయి, మౌనిష్, సత్య, లేంటిల్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మ మాట.. అంగన్‌వాడీ బాట


అశ్వారావుపేటరూరల్: జమ్మిగూడెంలో ర్యాలీ..

ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సోమవారం 'అమ్మ మాట– అంగన్‌వాడీ బాట'అను కార్యక్రమాన్ని నిర్వహించారు. అంగన్‌వాడీ సెంటర్లలో నూతనంగా తీసుకువచ్చిన బోధనా పద్ధతులు, పిల్లలకు సమకూరే మేలును వివరిస్తూ ప్రజలకు అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమ ఉద్దేశ్యం. ఇందులో భాగంగా పలు చోట్ల ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, టీచర్లు, హెల్పర్లు ర్యాలీలు నిర్వహించారు. కొత్త పాఠ్యప్రణాళిక పిల్లలకు ఆట, పాట, కథ, స్వేచ్ఛను కల్పించడంతోపాటు, వారి మేధో వికాస అభివృద్ధి, నైతిక, సామాజిక అభివృద్ధికి తోడ్పడే విధంగా ఉంటుందని వివరించారు.

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని మారుతీ నగర్ కాలనీలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించగా.. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ మాణిక్యమ్మ, టీచర్లు, లబ్ధిదారులు ర్యాలీ నిర్వహించారు.

చండ్రుగొండ: మండలంలోని తిప్పనపల్లి గ్రామంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నిర్మలాజ్యోతి ర్యాలీ ప్రారంభించారు. ఎంపీటీసీ లంకా విజయలక్ష్మి, సూపర్‌వైజర్ రాణి పాల్గొన్నారు.

అన్నపురెడ్డిపల్లి: ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు గంగాజలం, అరుణలు అంగన్‌వాడీ సిబ్బందితో కలిసి స్థానికంగా ర్యాలీ నిర్వహించారు. గ్రామస్తులకు అవగాహన కల్పించారు.

అశ్వారావుపేటరూరల్: మండలంలోని జమ్మిగూడెం సెక్టార్ పరిధిలో సీడీపీఓ రోజారాణి చేతుల మీదుగా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు వరలక్ష్మి, పద్మావతి, అంగన్‌వాడీ టీచర్ డి.నర్సమ్మ, గ్రామస్తులు పాల్గొన్నారు.